క్లుప్తంగా

ఐటీ రిటర్న్స్ దాఖలు చేయండి..



మాట్లాడుతున్న జీఎం జాన్ ఆనంద్

ఇల్లెందు: సింగరేణి ఉద్యోగులు నిబంధనల మేరకు ఐటీ రిటర్న్ దాఖలు చేయాలని ఏరియా జీఎం జాన్ ఆనంద్ తెలిపారు. శుక్రవారం ఇల్లెందులోని తన కార్యాలయంలో మాట్లాడారు. కొందరు ఉద్యోగులు కన్సల్టెన్సీ మాటలు నమ్మి తప్పుడు ధ్రువపత్రాలు సమర్పిస్తున్నారని తెలిపారు. ఐటీ క్లెయిమ్స్ సక్రమంగా సమర్పించకుంటే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఆర్థిక సాయం



నగదు అందజేస్తున్న నరసింహారావు స్నేహితులు

జూలూరుపాడు: ఇటీవల రోడ్డు ప్రమాదంలో కొత్తూరు గ్రామానికి చెందిన గార్లపాటి నరసింహారావు మృతి చెందాడు. శుక్రవారం నరసింహారావు కుటుంబానికి అతని స్నేహితులు రూ.25,000 ఆర్థిక సాయం అందించి, మానవత్వం చాటుకున్నారు. కార్యక్రమంలో పిన్నుల నరేష్, నేలాల సరేష్, నాగరాజు, ఉసికల భాస్కర్‌రావు, నాగేశ్వరరావు, కాశిమల్ల సురేష్, ఆనందరావు, పి.నరేష్, మిర్యాల జగదీష్, హనుమంతరావు, సతీష్, దుద్దుకూరి సురేష్, నున్నా నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మైనార్టీ కాలేజీలో చేరండి..



కరపత్రాలు అందజేస్తున్న అధ్యాపకులు

ఇల్లెందు: పట్టణంలోని తెలంగాణ మైనార్టీ బాలుర కళాశాలలో వచ్చే విద్యాసంవత్సరం ఇంటర్మీడియట్ విద్యార్థుల కోసం అధ్యాపకులు శుక్రవారం ముమ్మరంగా ప్రచారం చేశారు. ఇల్లెందులో ముస్లింలు నమాజ్ ఆచరించే క్రమంలో మజీద్‌ల వద్ద కరపత్రాలు అందజేశారు. పదో తరగతి ఉత్తీర్ణులైన బాలురను మైనార్టీ కాలేజీలో చేర్పించాలని కళాశాలను కాపాడుకోవాలని తల్లిదండ్రులను కోరారు. ప్రతీ గ్రూపులో 40 మందికి అవకాశం ఉందని, మైనార్టీలకు 30 సీట్లు, ఇతరులకు 10 సీట్లు ఉన్నాయని వివరించారు. కళాశాలలో ప్రత్యేక వసతులు ఉన్నాయని చెప్పారు. అనుభవజ్ఞులైన అధ్యాపకుల బృందంచే బోధన, ప్రత్యేక హాస్టల్ వసతి, అత్యాధునిక పరికరాలతో ప్రయోగశాలల ఏర్పాటు, వ్యక్తిత్వ వికాసం కోసం ప్రత్యేక సెమినార్‌లు, యోగా వ్యాయామ తరగతులు, మైనార్టీ తరగతుల వారికి అరబిక్ తరగతులు, ఐదు సార్లు నమాజ్ చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. ప్రిన్సిపాల్ ముద్దసిర్ హుస్సేన్, కొండల్‌రావు, అశోక్, సైదావళి, సాధిక్, రేష్మా, షానవాజ్, ప్రసాద్, గౌస్, సంధ్యారాణి, నజీమ్, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

మహబూబ్ అలీకి నివాళి

ఇల్లెందు: టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర నాయకుడు, రిటైర్డ్ టీచర్ మహబూబ్ అలీ మృతి పట్ల పలువురు ఉపాధ్యాయులు సంతాపం వ్యక్తం చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లో గుండెపోటుతో మృతి చెందిన మహబూబ్ అలీ ఇల్లెందు మండలంలో సుదీర్ఘకాలం పని చేశారని, ఈ ప్రాంత ప్రజలకు ఆయన ఎనలేని సేవలు అందించాడని సీపీఎం మండల కార్యదర్శి ఎస్‌ఏ నబీ తెలిపారు. మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలీ మృతి పట్ల ఎంఈఓ పిల్లి శ్రీనివాసరావు, టీపీటీఎఫ్ నేతలు బాలు, ఆంథోనీ, టీఎస్‌యూటీఎఫ్ నేతలు జయరాజు తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

ప్రకృతి కన్నెర్రతో ప్రమాదాలు

- మే నెలలో పలుచోట్ల పిడుగుపాటు
- మనుషులు, పశువులు మృతి
- జాగ్రత్తలు పాటిస్తే ప్రమాదాల నివారణ



పాల్వంచ మండలం రాళ్లచెలకలో పిడుగుపడి మృతి చెందిన పశువులు (ఫైల్)

చుంచుపల్లి: ఇటీవల అకాల పిడుగులు జనాలను హడలెత్తిస్తున్నాయి. మే నెలలో పిడుగుపాట్లు సాధారంగా మారాయి. గాలిదుమారం, అకాల వర్షాలకు తోడు పిడుగులు తోడయ్యాయి. ఇవి మనుషులు, పశువులను హరించివేస్తున్నాయి. ముఖ్యంగా మే నెలలోనే పిడుగుపాట్లు అధికంగా ఉండటం కొంత కలవరానికి గురిచేస్తోంది. ప్రకృతి వైపరిత్యాలు సర్వసాధారణమే. శీతోష్ణస్థితిలో వచ్చే మార్పులకు అనుగుణంగా అకాల వర్షాలు, ఉరుములు, మెరుపులతో కూడిన గాలివాన బీభత్సాలు మానవ జీవితాలపై ఎంతో ప్రభావితం చేస్తున్నాయి. ఎండా కాలాన్ని తలపించే ఉష్ణోగ్రతలు హడలెత్తిస్తున్న క్రమంలో కొన్నిరోజులుగా అకాల వర్షాలతో పాటు ఎక్కడో ఓ చోట పిడుగుపాటుకు పలువురు ప్రాణాలు సైతం వదులుతున్నారు. పశువులు సైతం మృత్యువాత పడుతున్నాయి. ఈ ఏడాది ఏప్రిల్ మొదటి వారం నుంచే ఎండలు దంచికొడుతున్నాయి. హఠాత్తుగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకుని ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో పిడుగులు భయోత్పాతాన్ని సృష్టిస్తున్నాయి. ఉన్నట్టుండి ఏదో ఒక ప్రాంతంలో వర్షం పడి ఆ వెంటనే మరుసటి రోజు ఎండ కొడుతోంది. వాతావరణంలో మార్పులు జన జీవనాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. తాజాగా గురువారం ములకలపల్లి, గుండాల, పాల్వంచ, కొత్తగూడెం, రామవరం, లక్ష్మీదేవిపల్లి, చుంచుపల్లి, ప్రాంతాల్లో పిడుగులు పడ్డాయి. రాత్రి రామవరం పంజాబ్‌గడ్డలో ఓ కొబ్బరిచెట్టుపై పిడుగుపడటంతో స్థానికులు భయాందోళన చెందారు. ఆ వెంటనే అంతటా జోరువాన అందుకుంది. అకాల వర్షంతో ఉరుములు, మెరుపులతో కూడిన పిడుగు పాటు ఘటనలు జనజీవనాన్ని భయాందోళనకు గురిచేశాయి. ఇక సోమవారం అకాల గాలిదుమారం, వర్షాలకు పలుచోట్ల పిడుగులు పడ్డాయి. పాల్వంచ మండలం రాళ్లచెలకలో పిడుగులు పడి పది పశువులు మృతి చెందాయి. వర్షం పడుతుండటంతో చెట్టు కిందకి వెళ్లగా చెట్టుపై పిడుగుపడటంతో అక్కడికక్కడే మృతి చెందాయి. అదేరోజు సుజాతనగర్ మండలం ఉప్పరిగూడెంలో మాలోత్ లక్ష్మణ్, శ్రీనుకు చెందిన పూరిళ్లు పిడుగుపాటుకు దగ్ధమైంది. పిడుగుపాటుతో ఇంట్లో ఉన్న వస్తువులన్నీ పూర్తిగా కాలి బూడిదయ్యాయి. ఈ నెల 4న గుండాల మండలం జగ్గాయిగూడెం గ్రామానికి చెందిన మొల్కం రామకృష్ణ ఇంటిపై పిడుగుపడటంతో గోడ పూర్తిగా కూలిపోయింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ నెల 3న ములకలపల్లి మండలం ఒడ్డుగూడేనికి చెందిన రైతు బోడా శివరామ్ పిడుగుపాటుకు గురై మృతి చెందాడు. గతేడాది మే 7న జూలూరుపాడు మండలం హరిజనవాడలో పిడుగుపడి రెండు పశువులు మృతిచెందాయి. మే-18న పాల్వంచలో కేటీపీఎస్ ఉద్యోగి ఏటూరి నాగేశ్వరరావు (54) పొలం వద్దకు వెళ్లగా వర్షం రావడంతో చెట్టు కిందకు వెళ్లాడు. చెట్టు సమీపంలో పిడుగుపడటంతో అపస్మారక స్థితిలో వెళ్లి చనిపోయాడు. గతేడాది మే-31న భద్రాచలంలో గాలి దుమారంతో కూడిన వర్షానికి భద్రాద్రి నర్సింహాస్వామి ఆలయం ధ్వజస్తంభంపై పిడుగుపడి దగ్ధమైంది.

పిడుగుల నుంచి రక్షణ ఇలా..

పిడుగు పడినప్పుడు దాని విద్యుదాఘాతానికి గురి కాకుండా తప్పించుకోవడం అసాధ్యం. ఎందుకంటే ఈ చర్యంతా జరగడానికి పట్టె సమయం సెకనులో 10వ వంతు మాత్రమే. ఒక చర్యకు మానవుడు ప్రతిస్పందించే సమయం కూడా అంతే ఉంటుంది. మెరుపులు, ఉరుములు, పిడుగుల గురించి విజ్ఞానాన్ని కలిగి ఉంటే మెరుపులు, పిడుగులు సంభవిస్తే ఎదురయ్యే ఆపదలను తగ్గించవచ్చు. ఉరుములు, మెరుపులు ప్రారంభం అయినప్పుడు నిర్జన ప్రదేశంలో ఉంటే సురక్షితమైన ప్రదేశానికి వెళ్లాలి. ఆ సమయంలో లోహపు వస్తువులను చేతిలో ఉంచుకోకూడదు. వర్షం కురుస్తున్నప్పుడు శరీరం, తల వెంట్రుకలు నిక్కబొడుచుకున్నాయంటే పిడుగు పడుతుందని గ్రహించాలి. ఆ వెంటనే చేతులు నేల మీద పెట్టకుండా తల వంచి మోకాళ్లపై కిందకు కూర్చోవాలి. పిడుగులు పడే సమయంలో నీటిలో ఉండడం క్షేమం కాదు. కాల్వలు, నదుల వద్ద ఉండడం అంతకంటే శ్రేయస్కరం కాదు. ఉరుముతున్నప్పుడు సైకిల్, స్కూటర్‌లపై ప్రయాణం చేయడం మంచిది కాదు. ఉరుములు, పిడుగులు పడే సమయంలో ఇంటి స్లాబ్‌పై నీళ్లను, నీటి ట్యాంక్‌ను అనుసంధానం చేసిన వాష్ బేసిన్‌లు, పైపులను తాకడం లాంటివి చేయకూడదు. అంతేకాదు విద్యుత్ పరికరాలు, సెల్‌ఫోన్‌లువీలైనంత వరకు ఉపయోగించవద్దు. విద్యుత్, సెల్‌ఫోన్ టవర్ల కింద నిల్చోకూడదు, ఇళ్లలో టీవీలకు కేబుల్, విద్యుత్ కనెక్షన్లను తొలగించాలి. ఇళ్లల్లో స్తూల వద్ద ఉండకూడదు. హీటర్లు, హెయిర్‌డ్రయిర్‌లు, కంప్యూటర్‌లు, ఇతర సర్క్యూట్‌లో ఉండే వస్తువులు వినియోగించకూడదు. పిడుగుపాటుకు గురై అపస్మారక స్థితిలో ఉన్న వ్యక్తికి వెంటనే ప్రాథమిక చికిత్స అందకపోవడం వల్ల మృతి చెందుతున్న సంఘటనలు ఉన్నాయని వైద్యులు అంటున్నారు. అయితే పిడుగుపాటుకు మనిషి చనిపోతే ప్రకృతి ప్రమాదంగా పరిగణించి మండల తహసీల్దార్ ఆధ్వర్యంలో పంచానామా నిర్వహించి సదరు కుటుంబానికి రూ.ఆరు లక్షలు, పశువులైతే రూ.20 వేల నుంచి రూ.లక్ష వరకు ప్రభుత్వం నుంచి అందజేస్తారు.



పిడుగుపాటుతో మృతి చెందిన రైతు బోడా శివరామ్ (ఫైల్)

కృత్రిమ శ్వాస అందించాలి...



పిడుగులు పడినప్పుడు చాలామందికి శ్వాస ఆడక చనిపోతుంటారు. కొందరు అపస్మారక స్థితిలోకి వెళ్తుంటారు. ప్రధానంగా తలవెనుక భాగంలో ఉండే మెదడు శ్వాస క్రియకు కేంద్రం కావడం వల్ల ఈ భాగానికే ప్రమాదం సంభవిస్తుంది. పిడుగుపాటుకు గురైన వ్యక్తికి కార్డియాక్ మసాజ్ లేదా, నోటిలో నోరు పెట్టి కృత్రిమ శ్వాసను అందించాలి.

– డాక్టర్ ఎ.పుష్పలత, జనరల్ ఫిజీషియన్

నకిలీ విత్తనాలు కొనుగోలు చేయొద్దు



రైతులతో మాట్లాడుతున్న ఏఓ సతీష్

ఇల్లెందురూరల్: నకిలీ విత్తనాల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయశాఖ అధికారి సతీష్ సూచించారు. మండలంలోని బొజ్జాయిగూడెం, రాఘబోయినగూడెం, కొమరారం, పోలారం, మర్రిగూడెం గ్రామపంచాయతీలలో శుక్రవారం రైతులతో సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు తమకు అవసరమైన విత్తనాలను లైసెన్స్ కలిగి ఉన్న వ్యాపారుల వద్ద మాత్రమే కొనుగోలు చేసి, విధిగా రశీదు తీసుకోవాలని చెప్పారు. సంబంధిత రశీదును పంటకాలం పూర్తయ్యే వరకు భద్రంగా ఉంచుకోవాలన్నారు. విత్తనాలు అధిక ధరలకు విక్రయించినా, నాసిరకం విత్తనాలు విక్రయించినా, లైసెన్స్ లేకుండా విత్తనాలు విక్రయించినా వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. సమావేశంలో ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

టేకులపల్లి: నిబంధనల ప్రకారమే విత్తనాలు, ఎరువుల విక్రయాలు జరపాలని అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఏడీఏ వాసవీరాణి అన్నారు. మండలంలోని ఫెర్టిలైజర్, పెస్టిసైడ్స్ వ్యాపారులతో శుక్రవారం ఆమె సమావేశం నిర్వహించారు. ఏడీఏ మాట్లాడుతూ.. ప్రతీ వ్యాపారి కంపెనీల నాణ్యమైన విత్తనాలు మాత్రమే విక్రయించాలని సూచించారు. మార్కెట్‌లోకి నకిలీ విత్తనాలు వస్తే వెంటనే తమకు సమాచారం అందించాలని కోరారు. దుకాణం వద్ద స్టాక్‌బోర్డు విధిగా పెట్టాలని, రైతు రిజిస్టర్, స్టాక్ రిజిస్టర్, బిల్‌బుక్ విధిగా కనిపించాలని సూచించారు. అనుమతిలేని విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను విక్రయిస్తే లైసెన్స్ వెంటనే రద్దు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో ఏఓ అన్నపూర్ణ, ఏఈఓలు శ్రావణి, విశాల, రమేష్, రెహానా, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి



మాట్లాడుతున్న రమేష్

ఇల్లెందు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని జిల్లాకు ఒక అధికారిని నియమించినప్పటికీ కింది స్థాయిలో తాగునీటి సమస్య తీరటం లేదని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఏజే రమేష్ అన్నారు. శుక్రవారం ఇల్లెందులోని సీపీఎం కార్యాలయంలో పట్టణ కమిటీ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. ఈసారి తీవ్రంగా మంచినీటి ఎద్దడి ఏర్పడిందన్నారు. గత ప్రభుత్వం అమలు చేస్తున్న మిషన్ భగీరథ ప్రయత్నం ఘోరంగా విఫమైందన్నారు. ఇంటింటి నల్లా నీరు అందించటంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని తెలిపారు. కింది స్థాయిలో అధికారులను సమన్వయం చేసుకుని సమస్యలను అధిగమించే యంత్రాంగం లేకుండా పోయిందన్నారు. అందువల్లే మండలంలోని దేవులపల్లి యాకయ్య నగర్, లాల్ మహ్మద్ నగర్, సున్నం రాజయ్యనగర్‌లో నీటి ఎద్దడి ఏర్పడిందన్నారు. అధికారులు తక్షణం జోక్యం చేసుకుని మంచినీటి ఎద్దడి సమూలంగా నివారించాలని కోరారు. తాగునీటి ఎద్దడి నివారణకు ప్రత్యక్ష ఆందోళన చేపడుతామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎస్ఏ నబీ, మోహన్ రావు, మాదారపు వెంకటేశ్వర్లు, షేక్ ఖాదర్, వాసం రాము, మునిగంటి లక్ష్మి పాల్గొన్నారు.

ఎంపీపీ, వైస్ ఎంపీపీ ఏకగ్రీవం



టేకులపల్లి: మౌనికకు నియామకపత్రం అందజేస్తున్న ఎన్నికల అధికారి వాసవీరాణి



ఇల్లెందురూరల్: వైస్ ఎంపీపీగా ప్రమాణ స్వీకారం చేస్తున్న రాము

టేకులపల్లి: టేకులపల్లి ఎంపీపీగా బానోత్ మౌనిక ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ ఎన్నికను ఎన్నికల అధికారి వాసవీరాణి నిర్వహించారు. మొత్తం 14 మంది ఎంపీటీసీలు ఉండగా సమావేశానికి 11 మంది హాజరయ్యారు. ఎంపీపీగా బానోత్ మౌనికను బద్దుతండా ఎంపీటీసీ ఊకే రామకృష్ణ ప్రతిపాదించగా, కొప్పురాయి చింత శాంతకుమారి, సులానగర్ ఎంపీటీసీ ఉండేటి ప్రసాద్ బలపర్చారు. నిబంధనల ప్రకారం ఉదయం 11 గంటల వరకు ఒకరి పేరును మాత్రమే ప్రతిపాదించడంతో మౌనిక ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి వాసవీరాణి ప్రకటించారు. అనంతరం మౌనికతో ఎంపీపీగా ప్రమాణస్వీకారం చేయించారు. మౌనికను ఎమ్మెల్యే కోరం కనకయ్య అభినందించారు.

ఇల్లెందురూరల్: ఇల్లెందు వైస్ ఎంపీపీగా ఇందిరానగర్ ఎంపీటీసీ మండల రాముమహేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో వైస్ ఎంపీపీ ఎన్నికను ఎన్నికల అధికారి రామకృష్ణ శుక్రవారం నిర్వహించారు. మండలంలో 15 మంది ఎంపీటీసీలు ఉండగా 11 మంది హాజరయ్యారు. వైస్ ఎంపీపీగా ఇందిరానగర్ ఎంపీటీసీ మండల రాము నామినేషన్‌ను ఎంపీపీ చీమల నాగరత్నమ్మ ప్రతిపాదించగా.. విజయలక్ష్మీనగర్ ఎంపీటీసీ పూనెం సురేందర్ బలపర్చారు. నిబంధనల ప్రకారం ఉదయం 11 గంటల వరకు మండల రాము నామినేషన్ ఒక్కటే దాఖలు కావడంతో ఆయన ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి రామకృష్ణ ప్రకటించారు. అనంతరం రాము చేత ఎన్నికల అధికారి ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ధన్‌సింగ్, ఎంపీఓ చిరంజీవి, సీనియర్ అసిస్టెంట్ పార్వతి పాల్గొన్నారు.

బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించాలి



పాల్వంచ: పట్టభద్రులతో మాజీ మంత్రి వనమా

కొత్తగూడెంటౌన్: ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ శుక్రవారం బీఆర్ఎస్ పార్టీ లీగల్ సెల్ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. కొత్తగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ మాట్లాడుతూ... బీఆర్ఎస్ పార్టీ బలపరిచిన ఏనుగుల రాకేష్‌రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలన్నారు. మహమద్ సాధిక్‌పాషా, న్యాయవాదులు జనపరెడ్డి గోపీకృష్ణ, జీకే అన్నపూర్ణ, జె.పద్మానాభరావు, గడిదాసి కాంతయ్య, ఉప్పుశెట్టి సునీల్ పాల్గొన్నారు.

పాల్వంచ: ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న బీఆర్ఎస్ పార్టీ బలపరిచిన ఏనుగుల రాకేష్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. శుక్రవారం పాల్వంచలో కోఆపరేటివ్ సొసైటీ ఉపాధ్యక్షుడు కాంపెల్లి కనకేష్ పటేల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎన్నికల ప్రచారంలో వనమా పాల్గొన్నారు.

మొదటి ప్రాధాన్యత ఓటు వేయండి..



ప్రచారం చేస్తున్న నాయకులు

జూలూరుపాడు: వరంగల్, నల్గొండ, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని హనుమకొండ బీజేపీ మాజీ ఎమ్మెల్యే మారుతినేని ధర్మారావు అన్నారు. బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రేమేందర్‌రెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ జూలూరుపాడు తహసీల్దార్ కార్యాలయం, ఎంపీడీఓ, ఈజీఎస్ కార్యాలయాల్లో బీజేపీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు, ఉద్యోగులను కలిసి బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రేమేందర్‌రెడ్డికి ఓటు వేసి గెలిపించాలని కోరారు. అనంతరం విలేకరులతో ధర్మారావు మాట్లాడుతూ.. కాంగ్రెస్, బీఆర్ఎస్, కమ్యూనిస్టులను ప్రజలు నమ్మడం లేదని, దేశ ప్రజలంతా ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం కావాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. ఈనెల 27న జరిగే ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో ప్రేమేందర్‌రెడ్డికి గ్రాడ్యుయేట్లు తమ మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. చిలుకూరి రమేష్, రమేష్, శ్యామ్ రాథోడ్, కొవ్వూరు నాగేశ్వరరావు, నున్నా రమేష్, మాదినేని సతీష్, సిరిపురపు ప్రసాద్, భూక్యా రమేష్, దిబ్బెందుల సాయి, సిరిపురపు పుల్లారావు, నారా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పట్టభద్రుల సమ్మేళనాన్ని జయప్రదం చేయండి

చుంచుపల్లి/ఇల్లెందు: కొత్తగూడెం క్లబ్‌లో శనివారం ఉదయం 10 గంటలకు జరగనున్న పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనంలో పట్టభద్రులు, మేధావులు, ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కేవీ రంగాకిరణ్ ఒక ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా ఇల్లెందులో జరగనున్న ఎన్నికల ప్రచార సభలో పాల్గొనేందుకు ఇల్లెందుకు మాజీ మంత్రి ఈటల రాజేందర్ రానున్నట్లు నియోజకవర్గ ఇన్‌చార్జ్ బలగానీ గోపీకృష్ణ తెలిపారు. ఉదయం 8 గంటలకు కార్యకర్తలతో టిఫెన్ కార్యక్రమం ద్వారా ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారని తెలిపారు.జిల్లాలోని పట్టభద్రులు, పార్టీ నాయకులు, అభిమానులు పాల్గొని సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని కోరారు.

సీనియర్ అసిస్టెంట్ సేవలు మరువలేనివి..



సంతాపం తెలుపుతున్న ఉద్యోగులు

కొత్తగూడెంరూరల్: జెడ్పీ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తూ ఇటీవల మృతి చెందిన పొలూరు శ్రీ కృష్ణ సేవలు మరువలేనివని పలువురు పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం జరిగిన ఆయన దశదిన కర్మలో పలువురు పాల్గొని శ్రీకృష్ణ చిత్రపటం వద్ద నివాళులర్పించి, కుటుంబీకులను పరామర్శించారు. జెడ్పీ సీఈఓ ప్రసన్నరాణి, పీఆర్ ఉద్యోగుల సంఘం నాయకులు ఎం.రాజేష్, నరేందర్, శ్రీనివాసరావు, రిటైర్డు ఎంపీడీఓ వెంకటపతిరాజు, మద్దెల శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఓటీపీ చెప్పొద్దు..

పాల్వంచరూరల్: హెచ్‌పీ గ్యాస్ ఆఫీసు నుంచి ఫోన్ చేసి ఓటీపీ అడుగుతున్నట్లు మాదృష్టికి వచ్చింది. అయితే మా ఆఫీసు నుంచి మా సిబ్బంది ఎవరూ ఫోన్ చేసి ఓటీపీ అడగడం లేదని హెచ్‌పీ గ్యాస్ మేనేజర్ అనంతుల లక్ష్మీనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. హెచ్‌పీ ఆఫీసు సిబ్బంది కానీ, గ్యాస్ డెలివరీ బోయ్ కానీ మెకానిక్‌లు గానీ మీ ఇంటికి వచ్చి భద్రత తనిఖీలు చేసినప్పుడు మాత్రమే అడిగితే ఓటీపీలు చెప్పాలని, ఫోన్ చేసి అడిగితే ఎవరూ ఓటీపీలు చెప్పవద్దని పేర్కొన్నారు.

నిరుద్యోగుల హక్కులు సాధించుకుందాం..



మాట్లాడుతున్న కామేష్

కొత్తగూడెంఅర్బన్: ఈనెల 27వ తేదీన జరగనున్న ఖమ్మం, వరంగల్, నల్గొండ ఎమ్మెల్సీ ఎన్నికలలో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న అశోక్ ఆన్‌లైన్ అకాడమీ, అశోక్ కోచింగ్ సెంటర్ నిర్వాహకుడు అశోక్‌కు బహుజన్ సమాజ్ పార్టీ మద్దతు తెలియజేస్తుందని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, యర్రా కామేష్ అన్నారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ..

నాలుగేళ్లుగా అశోక్ అకాడమీ ద్వారా గ్రామీణ ప్రాంత విద్యార్థులకు కేవలం ఒక్క రూపాయికే విద్యను అందించారని, రెండు లక్షల మంది విద్యార్థులకు ఉచితంగా తెలంగాణ చరిత్రను బోధించిన వ్యక్తి అశోక్ అని, పట్టభద్రులందరూ ఆయన మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో మారేపల్లి సుఖేష్, మహమ్మద్‌గౌస్, రవిచంద్ర, బోయ వెంకట్, గుగులోత్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

నేటితరానికి గిరిప్రసాద్ ఆదర్శం



సింగరేణి(కొత్తగూడెం): గిరిప్రసాద్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



సుజాతనగర్: నివాళి అర్పిస్తున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): తుపాకీ గుండ్లకు ఎదురొడ్డి నిలిచిన ధీశాలి గిరిప్రసాద్ అని, లక్షలాది ఎకరాల భూమిని పేదలకు పంచిన ఆయన నేటితరం కమ్యూనిస్టులకు ఆదర్శమని సీపీఐ భద్రాద్రి జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్‌పాషా అన్నారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో తెలంగాణ సాయుధ పోరాట యోధులు, రైతాంగ పోరాట యోధుడు, సీపీఐ జాతీయ ఉప ప్రధాన మాజీ కార్యదర్శి, మాజీ రాజ్యసభ సభ్యుడు నల్లమల గిరిప్రసాద్ 27వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిప్రసాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అరంతకం సాబీర్‌పాషా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వట్టికొండ మల్లికార్జున్‌రావు, జి.వీరస్వామి, కంచర్ల జమలయ్య, జక్కుల రాములు, భుక్యా శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, సందేబోయిన శ్రీనివాస్, ఎస్‌కే ఫహీమ్, ఖయ్యూం, లింగేష్, ఉన్నంసింగ్, రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

సుజాతనగర్: భారత కమ్యూనిస్టు పార్టీ నేత, అమరజీవి నల్లమల గిరిప్రసాద్ 27వ వర్ధంతిని మండల కేంద్రంలోని రజబ్ అలీ భవన్‌లో శుక్రవారం పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు.

ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ మండల కార్యదర్శి భూక్యా దస్రు, కోమారి హనుమంతరావు, జక్కుల రాములు, వేల్పుల భాస్కర్, వీర్ల మల్లేష్, మూడు గణేష్, భూక్యా తేజ, ముక్కెర మురళి, మండే నాగేశ్వరరావు, కోమారి కృష్ణ, దండు నాగేశ్వరరావు, మండే నాగమల్లేశ్వరరావు, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

మల్లన్నను గెలిపిద్దాం.. రాజ్యాంగాన్ని కాపాడుదాం..



చుంచుపల్లి: విద్యానగర్‌లో ఇంటింటి ప్రచారం..



ఇల్లెందు: ఏటీఎఫ్ నేతలను ఓటు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే కనకయ్య, నాయకులు

కొత్తగూడెంరూరల్: నిత్యం రాష్ట్రం, కేంద్రంలో జరుగుతున్న అన్యాయాలను, అక్రమాలను ఎండగడుతున్న యూట్యూబ్ చానెల్, పేపర్ ద్వారా నిలదీస్తున్న తీన్మార్ మల్లన్న (చింతపండు నవీన్)ను ఎమ్మెల్సీ ఉపఎన్నికల్లో గెలిపించి రాజ్యాంగాన్ని కాపాడాలని జిల్లా ఎమ్మెల్సీ ఎన్నికల కోఆర్డినేటర్ నాగా సీతారాములు అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో సీపీఐ, సీపీఎం, టీజేఎస్ పార్టీలు బలపరిచిన కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు ఓటేయాలని కోరుతూ సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషాతో కలసి నాగా సీతారాములు ప్రచారం చేశారు. ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంకులు, సింగరేణి హెడ్ ఆఫీస్, మెయిన్ ఆస్పత్రి ఉద్యోగులను, జిల్లా కోర్టు ఉద్యోగులను, బార్ కౌన్సిల్ సభ్యులైన పట్టభద్రులను కలిసి తీన్మార్ మల్లన్నకు మొదటి ప్రాధాన్యత ఓటు ఇవ్వాలని విన్నవించారు.

చుంచుపల్లి: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మద్దతుతో ఖమ్మం, వరంగల్, నల్గొండ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తీన్మార్ మల్లన్న విజయాన్ని కాంక్షిస్తూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరిషత్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు ఆధ్వర్యంలో శుక్రవారం కొత్తగూడెం విద్యానగర్ కాలనీలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో భాగంగా పట్టభద్రులను కలిసి ప్రజల సమస్యలపై అవగాహన ఉన్న వ్యక్తి, ప్రజా సమస్యలపై స్పందించే వ్యక్తి తీన్మార్ మల్లన్నకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పట్టభద్రులను కోరారు. శ్రీనివాసరెడ్డి, లక్ష్మణ్ నాయక్, లాల్‌సింగ్, కాన్షీరాం, భాస్కర్‌రెడ్డి, రమణారెడ్డి, శ్రీధర్, కనకరాజు పాల్గొన్నారు.

ఇల్లెందు: ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారానికి మరో రెండు రోజులే గడువు ఉండటంతో అభ్యర్థుల తరుపున ఎన్నికల ప్రచారం ముమ్మరమైంది. కాంగ్రెస్ పార్టీ బలపర్చిన ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను గెలిపించాలని ఎమ్మెల్యే కోరం కనకయ్య, మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, వైస్ చైర్మన్ సయ్యద్‌జానీపాషా, పట్టణ అధ్యక్షుడు దానియేల్, మాజీ చైర్మన్, వైస్ చైర్మన్లు యదల్లపల్లి అనసూర్య, పులిగళ్ల మాధవరావు తమ అనుచరులతో శుక్రవారం ప్రచారం నిర్వహించారు. ఉద్యోగులు, నిరుద్యోగ పట్టభద్రులను కలిసి ఓటు అభ్యర్థించారు. హరికృష్ణ, రమేష్‌బాబు, ముద్రగఢ వంశీ, జాఫర్, రమేష్, రాంచందర్, సాగర్, చిల్లా శ్రీనివాసరావు, అబ్దుల్ నబీ, వరలక్ష్మి పాల్గొన్నారు.